క్లుప్తంగా

పేదలకు మెరుగైన వైద్య సేవలు



దిగువమత్యంలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దిగువమత్యంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు అందించారు. 104 మొబైల్ క్లినిక్ ద్వారా గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. గర్భవతులు ఆస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు డీలర్ల సమావేశం

గుడిపాల: మండలంలోని రేషన్‌షాప్ డీలర్ల సమావేశం బుధవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఉన్న 49 మంది రేషన్ డీలర్లందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు. రానిపక్షంలో వారిపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలియజేశారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

వి.కోట: ప్రభుత్వ అనుమతులున్న వైద్యులు మాత్రమే వైద్య సేవలు అందించాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా వైద్య బృందం పర్యటించింది. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, అక్కడ వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన పైవిధంగా మాట్లాడారు. రిజిస్ట్రేషన్ లే ని క్లినిక్స్ మూసివేయాలని, ఒక వేళ అలా నిర్వహిస్తున్న పక్షంలో చట్టపరంగా చర్యలు తప్పవ ని హెచ్చరించారు. క్వాలిఫైడ్ డాక్టర్లు మాత్రమే క్లినిక్స్ నిర్వహించాలని, ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య బృందం పాల్గొంది.

పేదల ఆరోగ్యానికి భరోసా



వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నాంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు వ్యాధులు బారినపడే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయని, ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పాడిరైతుల అభివృద్ధికి కృషి



పాలక్యాన్‌లను అందిస్తున్న శ్రీజ నిర్వాహకులు

గుడిపాల: శ్రీజ డెయిరీ ద్వారానే పాడి రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పాడి రైతుల మహిళలకు వసంతాపురంలో స్టీల్ పాలక్యాన్లతో పాటు రైతులకు ఉపయోగపడే మొక్కజొన్నలు, పాడి ఆవులకు మినరల్ మిక్చర్, టానిక్‌లను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని పాలడెయిరీల కన్నా శ్రీజ డెయిరీలోనే అత్యధికంగా పాలధరలు ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు ప్రతి ఏటా బోనస్‌లు ఇస్తున్నామన్నారు.

ఉచిత శిక్షణ

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో డిగ్రీ అర్హతతో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, టెన్త్ అర్హతతో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో ఉచిత శిక్షణనిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గాలికుంటుకు టీకాతో చెక్

- 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు గాలికుంటు వ్యాధికి ఉచితంగా టీకాలు
- పశువుల సంరక్షణపై పశువైద్యశాఖ ప్రత్యేక దృష్టి



పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

బంగారుపాళెం: పశువుల్లో అనేక వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో నివారణకు పశువైద్యశాఖ ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసింది. వైరస్ వల్ల వచ్చే తీవ్రమైన అంటువ్యాధి ఈ గాలికుంటు వ్యాధి. చీలిన గిట్టలున్న పశువుల్లో మాత్రమే ఈ వ్యాధి కనిపిస్తుంది. గాలికుంటు వ్యాధి కలిగించే వైరస్‌లో ఓఏసీ, ఆసియా-1, సాట్-1, సాట్-2, సాట్-3 వంటి రకాలున్నాయి. వ్యాధి గాలి ద్వారా వ్యాపిస్తుంది. దేశవాళీ పశువుల కంటే సంకరజాతి పశువుల్లో ఎక్కువ నష్టం కలగజేస్తుంది. గాలి కుంటు వ్యాధి బారిన పడిన పాడిపశువు పాలు తాగితే దూడలు మృత్యువాత పడతాయి. పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. 20 నుంచి సెప్టెంబరు 18 వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గ్రామాల్లో ఉన్న ప్రతి పశువుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తోంది.

గాలికుంటువ్యాధిపై అప్రమత్తం

గాలికుంటువ్యాధి సోకిన ఆవులు, ఎద్దులు, గేదెల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. నీరసంగా మారి నడిచేందుకు ఇబ్బంది పడతాయి. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ వంటి మందులను వాడాల్సి ఉంటుంది



పశువులకు టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేడీ ప్రభాకర్

వ్యాధివ్యాప్తి

ఈ వ్యాధి కలిగించే వైరస్ క్రిములు పశువుల పేడ, పారుడు, పొంగు, వీర్యము, పాలు, పుండ్లు ద్వారా విసర్జింపబడి వేరొక పశువు నీటిద్వారా, గాలి ద్వారా, మేతద్వారా వ్యాప్తి చెందుతాయి.

టీకాలు వేయించాలి



పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాల్లో పాడిరైతులు తమ ఆవులు, ఎద్దులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు టీకా వేయించాలి. పశువులకు ఈ వ్యాధి సోకితే రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు ఉచితంగా టీకాలు వేయడం జరుగుతోంది. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు వేయించాలి. వ్యాధి రాకుండా ముందస్తుగా ఎంతో ఉపయోగపడుతుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ ఆసిఫ్, అసిస్టెంట్ డైరెక్టర్, బంగారుపాళెం

వ్యాధి లక్షణాలు

- ఇంకుబేషన్ కాలం 2 నుంచి 6 రోజులు వ్యాధికి గురయ్యే శాతం ఒకటి నుంచి రెండు శాతం ఉంటుంది.
- జ్వరం 104 నుంచి 106 డిగ్రీలు ఫారన్‌హీట్ ఉంటుంది.
- పశువు మేతమేయదు, నెమరువేయదు, నోటి లో బొబ్బలు పగిలి చొంగ కారుతుంటుంది.
- కాలి గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి పుండ్లుగా మారి పశువులు కుంటుతూ నడుస్తాయి.
- పనిచేసే పశువుల్లో శక్తి నశిస్తుంది.
- పాలిచ్చే పశువుల రొమ్ములపైన, పొదుగులపైన బొబ్బలు ఏర్పడి పొదుగు వాపు వస్తుంది.
- పాడిపశువులలో గర్భధారణ శక్తి కోల్పోతాయి.
- మేకలు, గొర్రెలు, పందుల్లోనూ గాలికుంటువ్యాధి వస్తుంది.

నివారణ చర్యలు

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.
- 5 శాతం క్రెసాల్‌ను నీటిలో కలిపి పశువుల పాకను కడిగితే వైరస్ నశిస్తుంది
- పక్క గ్రామాల్లో వ్యాధి ఉన్నప్పుడు పశువులను సంతలకు, జాతరలకు వెళ్లనివ్వరాదు
- ఆరోగ్యంగా ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా మొదటి సారి 2 నెలల వయసులోనే వేయించాలి. బూస్టర్ డోసు నెల తరువాత వేయించాలి. ఆ తరువాత ప్రతి ఏటా క్రమం తప్పకుండా వేయించాలి.
- టీకా మందు మోతాదు 2 ఎంఎల్ ఇవ్వాలి.
- టీకా వేసిన తరువాత 1 నుంచి 3 వారాల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొంది పశువులలో వ్యాధి సోకకుండా ఉంటుంది.
- పాడి పశువులకు ఈనిన తరువాత టీకా వేయించాలి.
- కలుషితమైన పశువుల దాణా, మేతలను కాల్చివేయాలి.
- వ్యాధి సోకిన ఆంబోతులు, దున్నలను సంపర్గానికి వినియోగించరాదు.
- పాలను బాగా వేడి చేసిన తరువాత తాగడానికి వినియోగించాలి.
- వ్యాధితో బాధపడుతున్న పశువుల పాలను తాగిన దూడలు చనిపోయే ప్రమాదం ఉంది.
- బశువుల కళేబరాన్ని లోతైన గొయ్యి తీసి అందులో సున్నం వేసి పాతిపెట్టాలి. లేదా కాల్చివేయాలి.

మెనూ ప్రకారం భోజనం

తవణంపల్లె: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ త్యాగరాజులురెడ్డి నిర్వాహకులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని దిగువ అరుంధతివాడ పాఠశాలలో మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు చదవడం రాయడంతో పాటు నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఎంఈఓ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్యం



చిత్తపారలో సేవలందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సంధ్య అన్నారు. చిత్తపార గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోనే ఉచితంగా వైద్యసేవలను అందించనున్నట్లు చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె రోగులకు సూచించారు. అనంతరం షుగర్, బీపీ రోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రక్తపరీక్షలు నిర్వహించి నెలకు సరిపడే మాత్రలను వారికి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, హేమలత, మంజుల, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాకారోత్సవం

బైరెడ్డిపల్లె: శ్రావణపౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు.

గ్రామాభివృద్ధి కోసమే శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న జిల్లా రిసోర్స్ పర్సన్ షణ్ముగం

ఐరాల: గ్రామాల అభివృద్ధి కోసమే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, వీధి దీపాల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారుచేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రోజూ తడి, పొడి చెత్త సేకరించాలన్నారు. చెత్త ద్వారా వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం వస్తుందన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్ షణ్ముగం మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి



బృందావనంలో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

తవణంపల్లె: గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి సంపదను ఉత్పత్తి చేయాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. రెండో రోజు మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు గ్రామాల అభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లు హరిప్రసాద్‌రెడ్డి, దుర్గాప్రసాద్ తవణంపల్లెలో క్షేత్రస్థాయిలో బృందావనం పరిశీలించి సేకరించిన తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలి. తద్వారా వర్మీకంపోస్టును ఎలా తయారు చేయాలి అనే విషయాలపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీ విధులు, అధికారాలు, చట్టాలు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, ఇంధన పొదుపు వంటి విషయాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖాకీల దందా

- అక్రమాలపై రహస్య నివేదిక
- ఉన్నతాధికారుల విచారణలోనూ తేలిన వాస్తవాలు
- త్వరలో వారిపై చర్యలకు ఎస్పీ నుంచి రానున్న ఉత్తర్వులు?



పలమనేరు: పలమనేరు పోలీస్‌స్టేషన్‌లో నలుగురు సిబ్బందిపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. కొంతకాలంగా వీరు పలు అక్రమాలకు పాల్పడినట్లు స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఎస్పీకి సమాచారం ఇవ్వడంతో దానిపై రహస్య విచారణ చేసినట్లు సమాచారం.

ఆ నలుగురూ ఎవరంటే..!

- ఇక్కడి స్టేషన్‌లో ఇంతకుమునుపు ఐడీ పార్టీలో పనిచేసిన ఓ కానిస్టేబుల్ గతంలో తనకు బైరెడ్డిపల్లెకు చెందిన ఒక పార్టీ నేతల అండదండలు న్నాయంటూ కొన్ని సెటిల్‌మెంట్లు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంలో బైరెడ్డిపల్లెకు చెందిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ముఖ్య అనుచరుడు తనకు బాగా తెలుసంటూ స్టేషన్‌లో అనధికారిక పెత్తనాన్ని చెలాయిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా స్టేషన్‌లోని ప్రతి విషయాన్నీ రాజకీయ నాయకులకు చేరవేస్తున్నాడనే ఆరోపణలు అతనిపై ఉన్నాయి.
- ఇదే స్టేషన్‌కు చెందిన మరో కానిస్టేబుల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద తన భార్య పేరిట ఫైనాన్స్ వ్యాపారాన్ని మొదలు పెట్టాడు. ఇంటికి సమీపంలోనే ఒక చిన్న రూమును ఫైనాన్స్ కార్యకలాపాలకు వినియోగిస్తూ, తాను పోలీసు కావడంతో ఎక్కడా ఏ సమస్యా తలెత్తకుండా వ్యాపారానికి అండగా ఉంటున్నాడు. దీనిపై నిఘా పెట్టిన ఎస్‌బీ అన్ని ఆధారాలతో విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేసినట్లు తెలిసింది.
- అలాగే పెట్రోలింగ్ విధులు నిర్వహించే కానిస్టేబుల్ స్థానికంగా ఒక ఆర్ఎంపీ కుమార్తెను వివాహం చేసుకున్నాడు. ఈ బంధుత్వంతో పట్టణంలోని ఆ సామాజికవర్గం అండ తనకుందంటూ అతను అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. అంతేకాకుండా పోలీస్‌శాఖ ఇచ్చిన బైక్‌ను సైతం తన సొంత పనులకు వాడుకుంటున్నట్లు నివేదికలో అతనిపై ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు భోగట్టా.
- పోలీస్ స్టేషన్‌లో ఒక సీనియర్ కానిస్టేబుల్ స్టేషన్‌ను వచ్చే వారి సమస్యలను తాను పరిష్కరిస్తానంటూ ఫిర్యాదుదారుల సెల్ నంబర్లు తీసుకొని వారితో డీల్ కుదుర్చుకుని వారినుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చినట్లు తెలిసింది. దీంతో ఈ నలుగురిపై జిల్లా ఎస్పీ రహస్యంగా శాఖాపరమైన విచారణ చేసి వాస్తవాలను ధ్రువీకరించుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వీరిపై అధికారికంగా చర్యలు తీసుకుంటారనే మాట వినిపిస్తోంది. ఈ విషయమై స్థానిక సీఐ నరసింహరాజును వివరణ కోరగా.. పోలీసుల వ్యవహారం తన దృష్టికీ వచ్చిందని, ఉన్నతాధికారులనుంచి అధికారికంగా ఇంకనూ ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు.

మన పంతం..దోమ అంతం

ఐరాల: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోకపోతే దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని కాణిపాకం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి శివయ్య తెలిపారు. దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది కాణిపాకంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శివయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఇంటి పరిసరాలను, చుట్టు పక్కల ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. ఇంటి ఆవరణల్లో నిల్వ ఉంచిన టైర్లు, కొబ్బరిచిప్పల వల్ల దోమలు అధికం అవుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. పిల్లలకు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు నాగరత్నమ్మ, మనోహర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దోమల లార్వాలను నిర్మూలించాలి

ప్రజలు ఇళ్లు, వాటి పరిసరాల్లో దోమల లార్వాలను గుర్తించి వాటిని నిర్మూలించి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి రక్షణ పొందాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత కోరారు. మంగళవారం ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆమె స్థానిక ఎంపీపీ పాఠశాల విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి వివరించారు. వైద్య సిబ్బందితో దోమలు సంతానోత్పత్తిచేసే లార్వాలను సమూలంగా నిర్మూలించి, ప్రతి శుక్రవారం డ్రైడేను పాటిస్తామని, ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామని, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించటంలో తమ వంతు పాత్ర పోషిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.



తవణంపల్లె: దోమల నియంత్రణపై ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ

తవణంపల్లె: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు పుట్టకూడదు, దోమలు కుట్టకూడదంటే దోమ తెరలు వాడాలంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, వినయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నియంత్రణ కోసం యుద్ధం చేయాలన్నారు. దోమల నియంత్రణపై అవగాహన కల్పించి దోమకాటు వల్ల జరిగే ప్రమాదాలను వివరించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి లార్వా దశలోనే నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమ రహిత సమాజం కోసం

కాణిపాకం: దోమ రహిత సమాజం కోసం అందరూ సమష్టిగా పనిచేయాలని చవటపల్లి వైద్యాధికారి దిలీప్‌కుమార్ అన్నారు. చిత్తూరు నగరంలోని చవటపల్లిలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. దోమల వ్యాప్తి, వాటి వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ప్రజలు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది గోపి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఐరాల: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



కాణిపాకం: అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



చిత్తూరు: చవటపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు

రేపు మాన్యం భూముల లీజు వేలం

చౌడేపల్లె: స్థానిక గోసలకురప్పల్లె గ్రామం వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి మాన్యం భూములు కౌలు లీజు విషయమై గురువారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు గ్రూప్ టెంపుల్ ఈఓ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల లీజుకు నాలుగు చోట్ల 16.32 ఎకరాల మాన్యం భూములకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు వెయ్యి రూపాయలు ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

హుండీ లెక్కింపు రేపు

చౌడేపల్లె: స్థానిక అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం 8 గంటలకు హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

22న విగ్రహ ప్రతిష్ఠ

బైరెడ్డిపల్లె: మండలంలోని చప్పిడిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 22న పెద్దపులి గంగమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయంలో మహా గణపతిపూజ, అనుజ్ఞ పుణ్యాహవాచన, లలితా సహస్రనామ పారాయణం, మంగళనీరాజనం కార్యక్రమాలు నిర్వహించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: స్థానిక ఐటీఐలో ప్రవేశానికి మూడవ పర్యాయం అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.నగేష్ తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసిన వారు ఈ నెల 27 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 29న ఉదయం 9 గంటలకు శాంతిపురం ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.